ఉచిత నేత్ర వైద్య శిబిరం



రాయదుర్గం: ఉచిత నేత్రవైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఆదివారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ, స్థానికుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలోని వైద్య బృందం 145 మంది స్థానికులకు కంటి పరీక్షలను నిర్వహించారు. వైద్యులు నిఖిల్ కాంబ్లే, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌కు పెయింటింగ్ పనులు షురూ



రాయదుర్గం: రోడ్డు డివైడర్‌కు పెయింటింగ్ చేసే పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం పాత ముంబయ్ జాతీయ రహదారి నుంచి జీపీఆర్ఏ క్వార్టర్స్, శాంతిసరోవర్, పుల్లెల గోపిచంద్ అకాడమీ వరకున్న రోడ్డులో డివైడర్‌కు పెయింటింగ్ చేసే పనులను నిర్వహించడం ప్రారంభించారు. ఈ పనులను శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ జీకేడీప్రసాద్ పరిశీలించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 30, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 40, చామ 50, కీర 30, బీర 30, వంకాయ 30, గోకర 45, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రం అందజేత



శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. లక్ష మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. వివేకానంద నగర్ కాలనీ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన వెంకటయ్య వైద్య కోసం జగదీశ్వర్ గౌడ్ కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అవసరమైన ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో వెంకటయ్యకు ఎస్‌టీసీ పత్రాలను అందజేశారు.

లింగంపల్లిలో వేడుకగా బోనాలు

శేరిలింగంపల్లి: శ్రావణమాస బోనాల వేడుకలు లింగంపల్లిలో కనులపండువగా ఆదివారం నిర్వహించారు. పోచమ్మ ఆలయం వద్ద బోనాల ఉత్సవాల్లో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీస్ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్ కుమార్, బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జీ ఎం.రవికుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు లేగల వెంకట్‌రెడ్డి, రాజ్యం మహిపాల్‌గౌడ్, బీజేపీ నాయకులు కె.ఎల్లేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: శ్రావణ సోమవారం నేపథ్యంలో శివాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పటాన్‌చెరు పాత టోల్‌గేట్ సమీపాన ఉన్న రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోనే ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్య నగర్ కాలనీలో ఉన్న మహదేవుని ఆలయంలో సోమవారం తెల్లవారుజాము 5 గంటలకు స్వామికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు.

క్యాండిల్ ర్యాలీ



రామచంద్రాపురం(పటాన్‌చెరు): కోల్‌కతాలో మహిళ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ను ఖండిస్తూ రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు శనివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రామచంద్రాపురం పట్టణంలో రమణ ఆధ్వర్యంలో యువకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు బలరాం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈనెల 20 తేదీ వరకు జరిగే పవిత్రోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరారు.

బాబోయ్... జ్వరం

కిక్కిరిసిన ఆస్పత్రులు

- కొండాపూర్ దవాఖానాకు క్యూ కడుతున్న బాధితులు
- హై ఫీవర్ కేసులు రోజుకు సగటున 37 మంది గుర్తింపు
- 17 రోజుల్లో 9 డెంగీ, ఒక మలేరియా, ఒక టైఫాయిడ్ కేసులు నమోదు



కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో ఓపీలో క్యూ కట్టిన రోగులు

గచ్చిబౌలి: విష జ్వరాలు ప్రబలడంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రులే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోను విష జ్వరాలకు గురైన పేషెంట్ల సంఖ్య అధికంగా ఉంటోంది. కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి జ్వర పీడిత రోగులు క్యూ కడుతున్నారు. రోజుకు సగటున 37 మంది హై ఫీవర్‌తో బాధపడుతున్నట్లుగా డాక్టర్లు గుర్తిస్తున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్న రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారు. ఒంటి నొప్పులు, వాంతులు, విరేచనాలు, చలి జ్వరం, తల నొప్పి, హై ఫీవర్, కళ్ల ఎర్రబడటం తది తర లక్షణాలో ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని, సొంత వైద్యానికి దూరంగా ఉండాలని డాక్టర్లు చెబుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్లేట్‌లెట్స్ తగ్గే అవకాశం ఉందని కొండాపూర్ సూరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు.



గర్భిణీ స్త్రీలు



శాంపిల్స్ ఇచ్చేందుకు లైన్‌లో..

17 రోజుల్లో 9 డెంగీ కేసులు నమోదు

గత నెలలో జ్వర పీడిత రోగుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ ఆగస్టు నెలలో విష జ్వరాల తాకిడి పెరిగిందనే చెప్పాలి. 17 రోజుల్లో కొండాపూర్‌జిల్లా ఆస్పత్రిలో ఓపీ విభాగంలో 9711 మంది రోజుకు సగటున 571 మంది రోగులు డాక్టర్లకు చూపించుకున్నారు. హై ఫీవర్‌తో 559 మంది బాధపడుతున్నట్లు డాక్టర్లు గుర్తించారు. విష జ్వరాల కారణంగా 83 మంది ఇన్ పేషెంట్లుగా ఆస్పత్రిలో చేరారు. రోజుకు సగటున 37 మంది హై ఫీవర్‌తో బాధపడుతున్నట్లుగా లెక్కలు చెబుతున్నాయి. జ్వర ప్రభావం తక్కువగా ఉన్న వారు డాక్టర్ల సూచన మేరకు మందులు తీసుకొని ఇళ్లకు వెళుతున్నారు.

దోమల నివారణతో 50 శాతం కేసులు తగ్గుతాయి



దోమల నివారణతో 50 శాతం జ్వరం కేసులు తగ్గుతాయి. అందుకే దోమల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా ఘటనతో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో డాక్టర్లు ఓపీ సేవలు నిలిపి వేసినా కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మాత్రం కొనసాగిస్తున్నాం. డాక్టర్లతో మాట్లాడి ఓపీ సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ అనురాగిని రెడ్డి, సూపరింటిండెంట్, జిల్లా ఆస్పత్రి కొండాపూర్



ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్



సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: మియాపూర్ ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వద్ద శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్‌గౌడ్‌లు హాజరై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, శేరిలింగంపల్లి గౌడ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణగౌడ్ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉపకమిషనర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్ నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అందరూ ఈ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమస్యల పరిష్కారం కోసం అక్కడే సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు అందిస్తామన్నారు. నిధులతో కూడుకున్న పనులను సంబంధిత అధికారులు పరిష్కరించి అంచనా నివేదికను తయారు చేస్తారన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారాన్ని పొందాలన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు

రాజేంద్రనగర్: రాఖీ పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, మార్కెట్ల వద్ద రాఖీ విక్రయాలు జోరుగా కొనసాగాయి. తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేయడంతో పాటు దుకాణాల్లో రాఖీలను పెద్ద ఎత్తున విక్రయించారు.

ఆకట్టుకున్న భరతనాట్యం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఆర్‌కేఎస్ కళాలయం నాట్య గురువు సుందరి రవిచంద్ర శిష్య బృందం గురు వందన భరతనాట్య ప్రదర్శనతో గురువులందరికి వందనం సమర్పించారు. గాత్రం శ్రీమంధా శ్రీనివాస్, వేణువు శేషం రమణ, నట్టువాంగం సుందరిరవిచంద్ర, వయోలిన్ అనిల్‌కుమార్,మృదంగం శ్రీధరాచార్యులు సంగీత సహకారాన్ని అందించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 20 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.8.20 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జై భారత్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్ నగర్‌లో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని అన్నారు. సీసీ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, కాలనీ వాసులు కుమారస్వామి, మహేష్, సురేష్, కృష్ణంరాజు, శివరాం ప్రసాద్, వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, సాంబశివరావు, నరేష్, రాఘవేంద్ర రావు, రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరపోచమ్మకు ప్రత్యేక అలంకారం



రాయదుర్గం: శ్రావణమాస ఆదివారం రాయదుర్గంలోని ఊరపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. నూతన వస్త్రాలతో అమ్మవారికి అలంకారం చేశారు. ఆలయంలో ప్రతి మంగళవారం, శుక్రవారం, ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించి అలంకారం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని దీప్తిశ్రీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని హోలిస్టిక్ ఆసుపత్రి వైద్యులు హాజరై కాలనీ వాసులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు, హోలిస్టిక్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

కేంద్రంలో కార్యదర్శిగా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



నాగరాజు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థికి ఉన్నత పదవి లభించింది. సీనియర్ ఐఏఎస్ అధికారి హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి నాగరాజుమద్దిరా కేంద్ర ఆర్థిక శాఖలోని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన 1988–90 విద్యా సంవత్సరంలో హెచ్‌సీయూలోని తత్వశాస్త్రంలో ఎంఏ పూర్తి చేశారు. ఆ సమయంలోనే హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడుగా కూడా పనిచేయడం విశేషం. హెచ్‌సీయూలో పూర్వ విద్యార్థుల స్పీకర్ సిరీస్‌లో భాగంగా 1990లో ఆర్థిక సంస్కరణలపై నాగరాజు ప్రత్యేక ఉపన్యాసం చేశారు.

'మనూ'లో ఇద్దరికి పీహెచ్‌డీ



తలత్ పర్వీన్



పీర్జాదా షుయబ్ అమీన్ పర్రా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ డిగ్రీలను ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ సైన్సెస్‌లోని ఫిజిక్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని తలత్ పర్వీన్‌కు,అలాగే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పరిశోధక విద్యార్థి పీర్జాదాషుయబ్ అమీన్ పర్రాకు పీహెచ్‌డీని ప్రకటించారు. తలత్‌పర్వీన్ 'భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో అస్థిరత సూచికల పరిశీలన, పోలికలు రేడియోసోండే డేటా ద్వారా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్ సమర్పించగా పీర్జాదాషుయబ్ అమీన్ పర్రా 'విపత్తు నిర్వహణలో పరిపాలన పాత్ర: కాశ్మీర్‌లో 2014 వరదల అధ్యయనం' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్పవరం

గచ్చిబౌలి: ముఖ్యమంత్రి సహయనిధి పేద ప్రజలకు గొప్పవరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా 20 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.8.20 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఆయన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి లబ్ధిదారులకు ఆదివారం అందించారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు మరిన్ని సదుపాయాలు

- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి



శివసేనారెడ్డిని కలిసిన తెలంగాణ హాకీ సంఘం నాయకులు

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో హాకీ క్రీడ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆయన ఛాంబర్‌లో తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండా విజయ్, కార్యదర్శి భీంసింగ్, ఆయనను కలిశారు. అక్టోబర్‌లో తెలంగాణ నిర్వహించే తెలంగాణ హాకీ టోర్నమెంట్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు.

ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పటేల్ కుంట పార్కు దగ్గర ఫస్ట్ కేర్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, బీఎంఐ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్ కేర్ ఫార్మసీ మేనేజర్ శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలని, పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీలు సురేష్, షహబాజ్, ఫస్ట్‌కేర్ ఫార్మసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల నిర్మాణమెప్పుడో?

ఆస్‌బెస్టాస్ కాలనీలోని హుడా లే అవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలం



ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

- మందుబాబులు, పోకిరీలకు అడ్డాగా మారిన వైనం
- ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం ఎదురు చూపులు



బడి, కళాశాల నిర్మాణం కోసం గతంలో వదిలిన ఖాళీ స్థలం

ఆల్విన్‌కాలనీ: పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవటంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల మధ్యలో ఉన్న జగద్గిరిగుట్ట ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా లే అవుట్ అనుమతులతో ఏర్పడింది. సుమారు 40 సంవత్సరాల క్రితం సనత్‌నగర్‌లోని బిర్లా కంపెనీ కార్మికుల కోసం కూకట్‌పల్లి జగద్గిరిగుట్టలో ఆస్‌బెస్టాస్ కాలనీ పేరుతో హుడా లే అవుట్ అనుమతులతో కాలనీలో ఇళ్లను నిర్మించి కార్మికులకు అందజేశారు. హుడా అనుమతుల ప్రకారం కాలనీలో గుడి, బడి, పార్కుల కోసం స్థలాలను వదిలారు. పార్కులు, గుళ్లను అభివృద్ధి చేశారు. కానీ కళాశాల కోసం వదిలిన ఖాళీ ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో పోకిరీలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. ఆస్‌బెస్టాస్ కాలనీ ఆనుకుని ఉన్న సుమారు 50 నుంచి 100 లోపు చిన్న చిన్న కాలనీ, బస్తీలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ చుట్టు పక్కల బస్తీల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టణాలలోని లే అవుట్‌లలోని ప్రభుత్వ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు నిర్మించాలని, ఆ స్థలాలను గుర్తించి సర్వే చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇక్కడి అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్‌బెస్టాస్ కాలనీలో హుడా అనుమతుల ప్రకారం ప్రభుత్వ కళాశాల, బడుల కోసం సుమారు అర ఎకరం పై నున్న ఖాళీ ప్రదేశంలో కళాశాలలను నిర్మించాలని కోరుతున్నారు.

కాలనీ ఏర్పాటప్పుడే స్థలాన్ని కేటాయించారు



తమ కాలనీ ఏర్పాటు చేసినప్పుడే ముందు చూపుతో బడుల కోసం స్థలాన్ని వదిలారు. కానీ ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తున్నది. దీంతో 10వ తరగతి వరకు చదివించి ఆపివేస్తున్నారు. ఈ ప్రాంతంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులు చదువులను కొనసాగిస్తారు.

– నరేష్, ఆస్‌బెస్టాస్ కాలనీ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు